చిన్నారుల బంగారు భవితకు

నాంది పలకాలి

- విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి
- ఆయా మండలాల ఎంఈవోలు పిలుపు
- పలు పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం

నవాబ్‌పేట : కాకర్లపహాడ్‌లో విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

ఊట్కూర్ : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

జడ్చర్లటౌన్, జూన్ 13 : చిన్నారుల కు అక్షరాభ్యాసం చేయించి బంగారు భవితకు నాంది పలకాలని జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మంజులాదేవి అక్షరాభ్యాసం కార్యక్రమానికి హాజరై చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించి మాట్లాడారు. ఈ ఏడాది కొత్తగా 15మంది పిల్లలు బడిలో చేరి అక్షరాభ్యాసం చేయడం అభినందనీయమన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థులకు పాఠ్యాపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్‌తోపాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. చిన్నారులను సర్కారు బడుల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అదేవిధంగా జడ్చర్ల ప్రభుత్వ పాఠశాలలో కౌన్సిలర్ కుమ్మరి రాజు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు సావితి, వనజ, కౌన్సిలర్లు నవనీత, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఊట్కూర్‌లో..

ఊట్కూర్, జూన్ 13 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంపీవో లక్ష్మీనర్సింహరాజు అన్నారు. మండలంలోని వల్లంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు తమ చిన్నారులను అంగన్‌వాడీ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అంజమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి, ఉపాధ్యాయులు శశిధర్‌రెడ్డి, సత్యపాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, సావిత్రి, ఆశ కార్యకర్త మణెమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహ్మదాబాద్‌లో..

మహ్మదాబాద్, జూన్ 13 : మండల కేంద్రంలో సీపీఎస్ నెంబర్-1, 2 పాఠశాలల్లో శుక్రవారం ఎంఈవో రాజునాయక్, జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక అక్షరభ్య సం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడీడు పిల్లందరిని బడిలో చేర్పించాలన్నారు.

మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ చిన్నారులను చేర్పించాలని మహబూబ్‌నగర్ అర్బన్ మండల ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథి హాజరయ్యారు. మెట్టుగడ్డలోని వెంకటేశ్వరకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్ బుక్స్, టెస్టు బుక్స్ అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో షాసాబ్‌గుట్ట జీహెచ్ఎం సేవ్యానాయక్, మాధవి ఉన్నారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, జూన్ 13 : ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈవో నాగ్యానాయక్ పేర్కొన్నారు. మండలంలోని కాకర్లపహాడ్ గ్రామంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరామ్‌నాయక్, మైసమ్మ ఆలయ కమి టీ చైర్మన్ జగన్ మోహన్‌రెడ్డి, క్లస్టర్ జీహెచ్ఎం దశరథ్‌నాయక్, కాకర్లపహాడ్ హెచ్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

నారాయణపేటలో..

నారాయణపేటరూరల్, జూన్ 13 : మండలంలోని జాజాపూర్, సింగారం, శేర్నపల్లి, కొల్లంపల్లితోపాటు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. జాజాపూర్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన అక్షరాభ్యాసం కార్యక్రమానికి డీఈవో గోవిందరాజులు హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం భారతి, హెచ్ఎం పద్మజ, సైన్స్ అధికారి భానుప్రకాశ్, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు బాలమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోస్గిలో..

కోస్గి, జూన్ 13 : ప్రభుత్వ బడుల్లోనే విలువలతో కూడిన విద్యా అందుతుందని గుండుమాల్ మండల విద్యాధికారి శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తపస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బడిబాటలో గుండుమాల్ చేరుకున్న ఆయన మాట్లాడుతూ ఎంతో నైపుణ్యం గల ఉపాధ్యాయులు ప్రభుత్వ బడులలో ఉంటారని, అలాంటి వారిచే విద్యాబోధన కేవలం ప్రభుత్వ బడుల్లోనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరకద్రలో..

దేవరకద్ర, జూన్ 13 : మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఈ ఏడాది నూతనంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించినట్లు ఆయా ఉపాధ్యాయులు తెలిపారు.

శ్రద్ధ చూపాలి

ఊట్కూర్, జూన్ 13 : ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ధనుంజయ గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోషి, సూపర్‌వైజర్ నర్సింహులు, టీబీ కోఆర్డినేటర్ శ్రీధర్, ఏఎన్ఎంలు సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

- డీఈవో ప్రవీణ్‌కుమార్

దేవరకద్ర : విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో

దేవరకద్ర, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని జిల్లా విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రధానోపాధ్యాయులు, స్కావెంజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఈవో హాజరై మాట్లాడారు. పాఠశాల తరగతి గదులు, వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మండలంలోని నార్లోనికుంట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరభ్యాసం చేయించి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాసులు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాసులు, ఎంఈవో బలరాం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల పరిశీలన

ఈవీఎం గోడౌన్ వద్ద కలెక్టర్, అధికారులు

నారాయణపేట టౌన్, జూన్ 13: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్ పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ల సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్, ఎన్నికల సామగ్రి భద్రపరిచిన గదులను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో రాంచందర్‌నాయక్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీ-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 13 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు జాతీయ కార్యాచరణ ప్రణాళిక పథకం కింద డీ-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి అర్హత కలిగిన ప్రభుత్వేతర సంస్థలు(ఎన్‌జీవోలు), స్వచ్ఛంద సంస్థల (వీవోఎస్) నుంచి ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిరబోయి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, జోగుళాంబ-గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో డీ-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల బారిన పడిన వారిని వ్యసనాల నుంచి బయటకు తీసుకురావడానికి కృషి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ-అనుధాన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు టీజీఏఎన్‌బీ ఆవేర్‌నెస్ వింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు 8712661735, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్ 9885938488 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే

మూసాపేట(అడ్డాకుల), జూన్ 13 : ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చేందుకే కృషి చేస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలో సీసీరోడ్డు, వాల్మీకి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఇండ్ల నిర్మాణం మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో బేస్‌మెంట్ పూర్తి చేసిన వేంటనే డబ్బులు అందజేస్తామన్నారు. ఎవరైనా అధికారులు, నాయకులు కానీ లంచం అడిగితే తనకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆయా గ్రామాల నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో నేతలు నాగిరెడ్డి, శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, రాధిక, శరత్‌కుమార్‌రెడ్డి, షఫీఅహ్మద్, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీనారాయణ, హన్మంతునాయక్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

నవాబ్‌పేట, జూన్ 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలన, లైంగిక వేధింపుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై విక్రమ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లైంగికంగా ఎవరైనా వేధిస్తే పోలీసులను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెడ్‌కానిస్టేబుల్ ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నారాయణపేట, జూన్ 13: నేతన్న పొదుపు పథకం (త్రిఫ్ట్ ఫండ్)కు గాను అర్హులైన మరమగ్గాల కార్మికులచే దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మరమగ్గాల కార్మికులు, అనుబంధమైన పనులు చేసేవారు ఈనెల 19లోగా దరఖాస్తులను స్థానిక కార్యాలయంలో అందజేయాలన్నారు.

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 13 : ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సాహసాన్ని ప్రదర్శించి ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలల నుంచి 2025 సంవత్సరానికి గానూ జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమశాఖ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నూతన ఆవిష్కరణ అసాధారణ ప్రతిభాపాటవాలు, క్రీడలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్యసాహసాలు ప్రదర్శించడం, సాంకేతిక పరిజ్ఞానం, పరిసరాలు, కళలు సాహిత్యం తదతర అంశాలలో అవార్డులు అందజేయబడతాయని పేర్కొన్నారు. ఈ అవార్డులకు 5ఏళ్లు పైబడి 18 ఏళ్లలోగా ఉన్న బాల బాలికలు అర్హులన్నారు. ఆసక్తి గల వారు https://awards.gov.in అనే వెబ్‌సైట్‌లో జూలై 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోని, దరఖాస్తు చేసుకున్న రశీదును మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్యే యెన్నంతో ట్రెసా జిల్లా నూతన కార్యవర్గం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 13: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ట్రెసా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శంకర్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలప్రసాద్, సునీల్‌కుమార్, గాయత్రి, సువర్ణ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒండ్రుమట్టి తరలింపును నిలిపివేయాలి

ధన్వాడ, జూన్ 13: మండలంలోని పెద్ద చెరువు నుంచి కొందరు అక్రమంగా ఒండ్రుమట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, సుధీర్‌కుమార్ రావు, మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు అక్రమంగా ఇటుక బట్టీలకు ఒండ్రు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని, ఒండ్రుమట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ధన్వాడ నుంచి మరికల్‌కు నిత్యం వందల ట్రిప్పుల ఒండ్రుమట్టిని తరలిస్తున్నారన్నారు. అధికారులు కూడా పార్టీ నాయకులకు తొత్తులుగా మారారని అన్నారు. వెంటనే ఒండ్రు మట్టి తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ తాసీల్దార్ కార్యాలయంలో వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మురళీధర్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, లక్ష్మారెడ్డి, సురేందర్ రెడ్డి, వడ్ల శాంత కుమార్, సత్యనారాయణ గౌడ్, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్

నారాయణపేట టౌన్, జూన్ 13: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట రీత్యా నేరమని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేట్ దవాఖానలు, డయాగ్నోస్టిక్స్ సెంటర్ల డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 ప్రకారం ప్రతి దవాఖాన నిర్వహణ, నియమ నిబంధనలకు అనుగుణంగా నడపాలన్నారు. ప్రతి దవాఖానకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. దవాఖానలో బయో మెడికల్ వేస్టేజ్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోగికి సంబంధించిన సమాచారాన్ని అభా రిజిస్ట్రేషన్‌లో నమోదు చేయాలని, టీబీ లక్షణాలు కనబడిన వారి సమాచారాన్ని సమీప ప్రభుత్వ దవాఖానకు ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా కేసులు గుర్తించిన వెంటనే ప్రభుత్వ దవాఖానకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్‌లో బార్ కేటాయింపు

మహబూబ్‌నగర్, జూన్ 13 : జిల్లా ఎక్సైజ్ శాఖ పరిధిలో కొత్త బార్ కోసం 49మంది టెండర్లు వచ్చాయి. శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శివాంద్ర ప్రతాప్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా టెండర్‌దారుడిని ఎంపిక చేశారు. 24వ నెంబర్ టెండర్‌దారుడికి జిల్లా కేంద్రానికి వన్నాడ శివ లక్కీడిప్‌లో బార్ సొంతం చేసుకున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన బార్‌కు రెండేళ్ల పాటు లైసెన్స్ ఉంటుంది. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, డీపీఈవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి నర్సింహారెడ్డి, సీఐ వీరారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

జడ్చర్లలో డ్రైనేజీ వ్యవస్థ పరిశీలన


డ్రైనేజీని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

జడ్చర్లటౌన్, జూన్ 13 : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్‌శాఖ ఆర్డీఎంఏ శ్రీనివాసరావు శుక్రవారం జడ్చర్ల మున్సిపాలిటీని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డితో కలిసి ఆయన పట్టణంలోని పలు వార్డులను పరిశీలించారు. పట్టణంలోని నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై డిసిల్టేషన్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే నల్లకుంట మినీ ట్యాంక్‌బండ్ వద్ద డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. 16వ వార్డులో కొత్త డ్రైనేజీ పనులను తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చైతన్యచౌహాన్, కుమ్మరి రాజు, శశికిరణ్, జ్యోతి, సతీశ్, మున్సిపల్ ఏఈ వినోద్ పాల్గొన్నారు.

మోజర్ల ఉద్యాన కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

పెద్దమండడి, జూన్ 13 : వనపర్తి జిల్లా పెద్దమండడి మండలంలోని మోజర్ల, కొల్లాపూర్‌లో ఉన్న కొండాలక్ష్మణ్ ఉద్యాన కళాశాలలో చదివేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ సైదయ్య తెలిపారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిదాయలయంలో రెండేండ్ల ఉద్యాన డిప్లొమా కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన చెప్పారు. మొత్తం 200 సీట్లు ఉంటే ఉద్యాన విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్‌లు ఆదిలాబాద్, రామగిరికిల్లా, కొల్లాపూర్ ఉద్యాన కళాశాలల్లో 40చొప్పున ఇంటెక్ కెపాసిటీ ఉందని చెప్పారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఇప్పటికే ఆప్లికేషన్లు తీసుకుంటుందని, అప్లికేషన్లు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 28 చివరి తేదీ అని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలిసెట్ 2025 లేదా పదో తరగతి పాసైన వాళ్లు, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు డిప్లొమాకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పాలిసెట్ 2025 ర్యాంకు లేదా సమానమైన పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా విద్యార్థులు అడ్మిషన్లు ఉంటాయని ఆయన తెలిపారు. డిసెంబర్ 31, 2025 నాటికి కనీసం 15 ఏండ్లు, గరిష్ఠంగా 22 ఏండ్ల వయసు కలిగి ఉండాలని, 60శాతం సీట్లు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం నాలుగేండ్లు చదివిన విద్యార్థులకు కేటాయిస్తారు.

కరపత్రాలు ఆవిష్కరణ

జడ్చర్లటౌన్, జూన్ 13 : జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ దవాఖాన సౌజన్యంతో ఈనెల 16వ తేదీన జడ్చర్ల మండలం కోడుగల్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేసి వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు అందించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ యాదయ్య, ఇంతియాజ్, నవీన్‌రెడ్డి ఉన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

మహబూబ్‌నగర్, జూన్ 13 : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయశాఖ ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంట వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, ఇది వరకు కోర్టు ముందుకు రాని కేసులను రాజీమార్గం ద్వారా జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో తమ కేసులు పరిష్కారించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, కుటుంబ తగాదులు, మోటార్ వెహికల్ రోడ్డు ప్రమాదాలు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటి కేసులు, డ్రంకెన్ డ్రైవ్, చెక్ బౌన్స్, బ్యాంకు కేసులు, బీఎస్ఎన్ఎల్ ప్రిలిటీగేషన్ వంటి కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎనిమిది బెంచీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు, న్యాయవాదులు, సామాన్య ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మందులు చీటి లేకుండా విక్రయిస్తే కేసులు

మహబూబ్‌నగర్, జూన్ 13 : డాక్టర్ రాసిన మందుల చీటి లేకుండా మందులను విక్రయిస్తే డ్రగ్ కంట్రోలర్ యాక్టు ప్రకారం మెడికల్ దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేశ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఏడీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఔషదాలు విక్రయించకుండా అధిక మోతాదులో గల మందులను, ఆర్ఎంపీ డాక్టర్లు అనుమతి లేకుండా విక్రయాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మందుల చీటి, బిల్లులు లేకుండా యాంటి బయోటిక్స్ విక్రయిస్తున్న 17 దుకాణాలను గుర్తించి షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

మక్తల్, జూన్ 13 : ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మక్తల్ మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీలోని 12వ వార్డులో పట్టణ ప్రజలకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఒక్క కాలనీలో ప్రజలు తమ నిత్యజీవితంలో పరిశుభ్రంగా ఉండాలంటే మన పరిసరాలను శుభ్రపరుచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేర్వేరు చేసి మున్సిపల్ చెత్త బండికి అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.

నిబంధనల మేరకు

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

మహ్మదాబాద్, జూన్ 13 : ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రామానికి 145 ఇళ్లు మంజూరు కాగా 94 ఇండ్లు ప్రారంభం జరిగింది. అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలు ఎలా నిర్మించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ ఏఈ బసప్ప, నాయకులు నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిరంగా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలమూర్‌లో చైన్‌స్నాచింగ్

మహబూబ్‌నగర్ , జూన్ 13 : జిల్లా కేంద్రంలో ఓ మహిళ తన స్కూటీపై వెళ్తుంటే గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్నా మూడు తులాల బంగారం పుస్తెల తాడు గోలుసును తెంపుకొని పరారైన ఘటన చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్ కుమార్ కథనం మేరకు పట్టణంలోని కుమ్మరివాడికి చెందిన పద్మా అప్పన్నపల్లిలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్ సమీపంలో నూతనంగా ఇల్లు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ఈ నెల 11వ తేదీన తమ ఇంటి నిర్మాణ పనుల నిమిత్తం అప్పన్నపల్లికి వెళ్లి అదే రోజు సాయంత్రం తన స్కూటీ పైన ఇంటికి వెళ్లేందుకు బయలు దేరింది. ఇది గమనించిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై బృందావన్ గార్డెన్ సమీపంలోకి రాగానే ఒంటరిగా స్కూటీపై వెళ్తున్న పద్మా మెడలో ఉన్నా బంగారం పుస్తెలా చైన్‌ను తెంపుకొని పరారు అయ్యారు. అదే రోజు రాత్రి పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు.

బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కృష్ణయ్య

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 13 : పీయూ తెలుగుశాఖ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ మనెమోని కృష్ణయ్యను నియమిస్తూ పాలమూరు యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ జీఎన్.శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం పీయూ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లోని వీసీ ఛాంబర్‌లో నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

దేవరకద్ర, జూన్ 13 : గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. వర్షకాలంలో జాగ్రతలు తీసుకోవాలన్నారు.

కేసు నమోదు

భూత్పూర్, జూన్ 13 : చైల్డ్ లెబర్‌తో పని చేయించుకుంటున్నాడని కేసునమోదు చేసినట్లు భూత్పూర్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భూత్పూర్ మున్సిపాలిటీలోని రామలింగేశ్వరస్వామి బైక్ మెకానిక్ షాపులో భూత్పూర్ మండలం రేకులగుట్టతండాకు చెందిన మైనర్ బాలుడు విస్లావత్ సిద్ధూనాయక్ పనిచేస్తుండగా బాల కార్మీక నిర్మూలన అధికారుల ప్రత్యేక బృందం శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. ఆ బాలున్ని అధికారులు తీసుకొని వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైక్ షాపు నిర్వాహకుడు రమేశ్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUILDING CONSTRUCTION
★ Mahabubnagar పాత జిల్లాలో ఇండివిజువల్ ఇల్లు, హాస్పిటల్ బిల్డింగ్, కమర్షియల్ బిల్డింగ్ కట్టుకోవాలనుకునే వారికి మేము పూర్తిగా 100% క్వాలిటీతో మీ కలలను సాకారపరుస్తు అద్భుతంగా నిర్మించి ఇవ్వగలం. Brick & Bond Home Constructions. Contact Cell Nos : 7013510429, 9160069191.
NT-MBNR

FLAT FOR SALE
★ Mahabubnagar టౌన్లో కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 2BHK మరియు 3BHK Flats అమ్మకానికి కలవు. Ready to occupy, 90% హౌసింగ్ లోన్ ఫెసిలిటి, False Celling, లిఫ్ట్, జనరేటర్ మరియు 24 గంటలు CC కెమెరా సౌకర్యం కలదు. SS Constructions. Contact Cell Nos : 7013510429, 9441382770.
NT-MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748